‘ప్రతిరోజూ స్పందన’కు స్వస్తి !

- గ్రామ సచివాలయాల్లో జరగని ‘ప్రతిరోజూ స్పందన’ కార్యక్రమం
- గత్యంతరం లేక మండల స్థాయి స్పందనకు అర్జీదారులు
- ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్న కూటమి ప్రభుత్వం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయం.

పుల్లలచెరువు: గ్రామ సచివాలయాల పరిధిలో పరిపాలన సౌలభ్యం లో భాగంగా నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ‘ప్రతి రోజు స్పందన’ కార్యక్రమానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్వస్తి చెప్పినట్లే అని విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ సచివాలయాల్లో ఎక్కడా దాని ఆనవాళ్లు కనిపించడం లేదు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం లో అధికారులంతా ప్రజలకు జవాబుదారీగా ఉండాలంటూ ప్రతి రోజు స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎవరికైనా ఫిర్యాదు చేసేందుకు ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రతి రోజు సాయంత్రం మూడు నుంచి నాలుగు గంటల వరకు పంచాయతీ కార్యదర్శితో పాటు సచివాలయంలోని అధికారులందరూ ఈ స్పందనకు హాజరయ్యేవారు. గ్రామంలో ఏ విధమైన సమస్య ఉన్నా స్థానికంగా ప్రతి రోజు గంట పాటు నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు ఫిర్యాదు చేసి సమస్యలను వెంటనే పరిష్కరించుకునే వారు. గ్రామంలోనే స్పందన కార్యక్రమం ఏర్పాటు చేయడంతో ప్రజలకు దూరాభారం, ఆర్థిక ఇబ్బందులు, సమయం వృథా కాకుండా ఇంటికి సమీపంలోనే స్పందన జరగడంతో ప్రజలకు మరింత అనుకూలంగా ఉండేది. జీవనోపాధి కోసం వివిధ పనులకు వెళ్లే గ్రామీణ ప్రజలను దృష్టిలో పెట్టుకుని ఈకార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో మండల స్థాయిలో నిర్వహించే స్పందనకువెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది.

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇబ్బందులు:

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. గ్రామ స్థాయిలో ప్రతి రోజు గంట పాటు జరిగే స్పందన కార్యక్రమంపై చిన్నచూపు చూడడంతో ప్రజలు మండల స్థాయి స్పందనకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. దీనిపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే గ్రామ స్థాయిలో స్పందన కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తే వృద్ధులు, మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని అంటున్నారు. ఆయా గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే ఎన్నో వ్యయప్రయాసలు పడాల్సి వస్తోంది.

పేరుకుపోతున్న సమస్యలు:

గ్రామాల్లోని సమస్యలను అధికారులకు విన్నవించేందుకు మండల కేంద్రానికి రావాల్సి ఉండడంతో చాలా మంది బాధితులు ఇబ్బందులు పడి సమస్యలను చెప్పుకోలేకపోతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. ప్రస్తుతం మండల కేంద్రంలోనే స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

గ్రామస్థాయి స్పందన కొనసాగించాలి



ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని వెంటనే గ్రామస్థాయిలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలి. ఓ మంచి కార్యక్రమాన్ని నీరు గార్చకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకుని గ్రామ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకునేలా సచివాలయాల్లో గత ప్రభుత్వం మాదిరిగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి.

– కె.కోటిరెడ్డి, రైతు, ఉమ్మడివరం.

మహిళలు, వృద్ధులకు చాలా కష్టం



మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుచి రావాలంటే మహిళలు, వృద్ధులకు చాలా ఇబ్బందిగా ఉంటోంది. వారి కష్టాలు చెప్పుకునేందుకు గత ప్రభుత్వం గ్రామాల్లోనే స్పందన అనే మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు కూడా దానిని పూర్తి స్థాయిలో కొనసాగించాలి.

– జి.గురునాథం, మండల సీపీఐ కార్యదర్శి, పుల్లలచెరువు.

రైతు సేవా కేంద్రాలకు తాళం





తాళం వేసి ఉన్న పోతవరం, బసిరెడ్డిపల్లె రైతు సేవా కేంద్రాలు

- సర్వేల పేరుతో వెళ్లిపోతున్న సిబ్బంది
- ఇబ్బంది పడుతున్న పశుపోషకులు

దర్శి(కురిచేడు): పశుపోషకులకు అందుబాటులో ఉండి సేవలందించాల్సిన సిబ్బంది సర్వేల నెపంతో విధులకు దుమ్మా కొడుతుండటంతో పశుపోషకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దర్శి మండలంలోని బసిరెడ్డిపల్లి, పోతవరం, లంకోజనపల్లి రైతు సేవా కేంద్రాల యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్లు సక్రమంగా కార్యాలయాలకు రావడం లేదని స్థానిక పశుపోషకులు ఆరోపిస్తున్నారు. కార్యాలయాలకు తాళం వేసి ఉండటంతో వెనుదిరిగి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులు, పశుపోషకులకు సేవలందించేందుకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అందులో వ్యవసాయ, పశువైద్య సహాయకులను నియమించింది. సర్వేలను వలంటీర్లతో నిర్వహించి ప్రజల అవసరాలు తెలుసుకుని ప్రజల ఇళ్ల వద్దే సేవలను అందించేవారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా సర్వేలు చేయిస్తోంది. అందుకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని పూర్తిగా వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో వ్యక్తిగత పనులపై సచివాలయాలకు వచ్చిన వారికి ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. ‘ఫలానా కార్యదర్శి ఉన్నారా?’ అని ఎవరైనా ప్రశ్నిస్తే ‘లేరు.. సర్వేకు వెళ్లారు’ అని సమాధానం వస్తోంది. ఇదిలా ఉండగా సర్వేలో భాగస్వాములు కాని యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్లు కొందరు ఈ నెపంతో విధులకు దుమ్మా కొట్టడం విమర్శలకు తావిస్తోంది. శనివారం రోజున సిబ్బంది అందుబాటులో లేని విషయమై దర్శి పశుసంవర్ధక శాఖ ఏడీని వివరణ కోరగా ‘సచివాలయ ఉద్యోగులు సర్వే చేస్తున్న మాట వాస్తవమే. విధులను సక్రమంగా నిర్వహించని వారిపై చర్యలు తీసుకుంటాం’ అని చెప్పారు.

సూపర్ సిక్స్ అమలు ఎప్పుడు..?

- అసెంబ్లీ సమావేశాల్లోనైనా చర్చించేనా...
- వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘు

పుల్లలచెరువు: సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా సీఎం చంద్రబాబు పేదలను మోసం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.జానకిరఘు ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు అవుతున్నా సూపర్‌సిక్స్ పథకాల అమల్లో నిర్లక్ష్యంగా ఉందన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తానని కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారన్నారు. సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో ప్రతి నెలా కొంత మంది లబ్ధిదారులకు కోత విధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంపద సృష్టిస్తానని అనేక బహిరంగ సభల్లో చెప్పిన చంద్రబాబు ఈ తొమ్మిది నెలల పాలనలో ఎంత సంపద సృష్టించారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. సామాజిక భద్రత పింఛన్లు, ప్రభుత్వ ఉద్యోగులు జీతాల కోసం ఇప్పటి వరకు రూ.1.50 లక్షల కోట్లు అప్పుల చేశారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పులు చేసి రాష్ట్రాన్ని శ్రీలంక చేస్తున్నారని ప్రచారం చేసిన చంద్రబాబు తక్కువ రోజుల పాలనలోనే అంత మొత్తంలో అప్పుల ఎలా చేశారని ప్రశ్నించారు. కరోనా వంటి కష్ట కాలంలో రాష్ట ఆర్థిక పరిస్థితి దిగజారిపోయినా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు. తల్లికి వందనం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సహాయం, రైతులకు పెట్టుబడి సహాయం ఎప్పుడు ఇస్తారో చెప్పాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన వారికి పింఛన్లు లేక, రేషన్‌కార్డులు లేక ఎంతగా ఇబ్బంది పడుతున్నారో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పేదల కష్టాలు అర్థమవుతాయని అన్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో శ్రద్ధ చూపాలని రఘు డిమాండ్ చేశారు.

ముందుకు కదలని మురుగు

కంభం: మండలంలోని కందులాపురం పంచాయతీ పరిధిలోని కల్కి భవన్ వీధిలో ఉన్న డ్రైనేజీలు పూడిపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. గృహాల ముందు మురుగు నిలిచి దుర్వాసన వస్తుండటంతో పాటు దోమలకు ఆవాసంగా మారింది. కొన్ని చోట్ల డ్రైనేజీ లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. ఇక్కడ మాత్రం డ్రైనేజీల నిర్వహణను పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. కల్కి భవన్ వీధిలోని రామాలయానికి వచ్చే భక్తులు సైతం దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు పడినప్పుడు సమస్య ఇంకా తీవ్రంగా ఉంటోందని, పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీలో పూడిక తీయించాలని స్థానికులు కోరుతున్నారు.

తడిచెత్త, పొడి చెత్త వేరుచేయాలి



ప్రజలకు కరపత్రాలు పంచుతున్న అధికారులు

కంభం: ప్రజలు ఇళ్లలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరు బుట్టల్లో ఉంచి పంచాయతీ రిక్షాల్లో వేయాలని ఈఓపీఆర్డీ విజయలక్ష్మి సూచించారు. స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం పంచాయతీ అధికారులు ప్రజలు, వ్యాపారులకు కరపత్రాలు పంచుతూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో, వీధుల్లో చెత్త వేస్తే ఏపీ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రూ.500 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. భూమిలో కలిసి కుళ్లిపోయే పదార్థాలన్నీ తడి చెత్త కిందకు వస్తాయని, భూమిలో కలిసిపోని పదార్థాలన్నీ పొడి చెత్త కిందకు వస్తాయని, దాన్ని బట్టి ప్రజలు ఇంట్లోనే చెత్తను వేరు చేసి రిక్షాల్లో వేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్నాటి బోడయ్య, పంచాయతీ కార్యదర్శి రమేష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మైలురాయిని ఢీకొని కారు బోల్తా

కంభం: మైలురాయిని ఢీకొట్టి కారు బోల్తాపడటంతో ఇద్దరికి తీవ్ర, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం అనంతపురం-అమరావతి హైవేపై కంభం-జంగంగుంట్ల మధ్యలో చోటుచేసుకుంది. వివరాలు.. బేస్తవారిపేట నుంచి మార్కాపురం వెళ్తున్న ఓ కారు కంభం-జంగంగుంట్ల మధ్యలో నల్లవాగు సమీపంలో హైవే పక్కన ఉన్న మైలురాయిని బలంగా ఢీకొని బోల్తా పడటంతో నుజ్జునుజ్జయింది. కారులో ఐదుగురు ఉండగా కాశిరెడ్డి, డ్రైవింగ్ చేస్తున్న చందుకు తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. కాశిరెడ్డిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా చందును పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని కంభం ఎస్సై నరసింహారావు పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు.



సంఘటనా స్థలంలో నుజ్జయిన కారు

రామిరెడ్డి కుటుంబానికి

ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ



పొందుగుల రామిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

పెద్దదోర్నాల: అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పొందుగుల రామిరెడ్డి కుటుంబ సభ్యులను యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆదివారం పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పడమటి బొమ్మలాపురానికి చెందిన పొందుగుల రామిరెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై మరణించిన నేపథ్యంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ బొమ్మలాపురం చేరుకుని రామిరెడ్డి భార్య వీరమ్మ, కుమారుడు పొందుగుల బోరెడ్డిలను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి, మండల నాయకులు చంద్రకాంత్‌నాయక్, చిట్టి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, నాయకులు దూదేకుల రసూల్, చిన్న గుడిపాడు సర్పంచ్ పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే తాటిపర్తి

- శివరాత్రి నేపథ్యంలో బొమ్మలాపురం గ్రామస్తుల అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం వెళ్లే యాత్రికులు, శివభక్తులకు మండల పరిధిలోని బోడేనాయక్ తాండా సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద బొమ్మలాపురం గ్రామస్తులు అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం నుంచి చేపట్టారు. కార్యక్రమంలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొని అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో దూరం నుంచి నియమ నిష్టలతో ఇరుముడులు ధరించి శ్రీశైలం తరలివచ్చే భక్తులు, యాత్రికులకు అన్నదాన కార్యక్రమం చేపట్టడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమాన్ని చేపట్టిన బొమ్మలాపురం గ్రామస్తులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి శివస్వాములు



గొబ్బూరు శివాలయంలో ఇరుముడితో శివస్వాములు

పెద్దారవీడు: మండలంలోని గొబ్బూరు గ్రామం జ్ఞాన ప్రసునాంబా సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివదీక్ష స్వీకరించిన శివస్వాములు ఇరుముడితో ఆదివారం శ్రీశైలానికి బయలుదేరారు. శివస్వాములు 41 రోజులు భక్తిశ్రద్ధలతో శివమాలధారణలో కఠోర దీక్ష ఆచరించారు. శివాలయంలో శివస్వాములు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భరద్వాజశర్మ ఆధ్వర్యంలో శివస్వాములు ఇరుముడి కట్టించుకొని శ్రీశైలంలో ఇరుముడి ఇచ్చేందుకు వాహనాల్లో బయలుదేరారు. శివస్వాములను పుణ్యక్షేత్రానికి సాగనంపేందుకు వచ్చిన దీక్ష స్వాముల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో శివాలయంలో సందడి నెలకొంది. గ్రామానికి చెందిన సర్పంచ్, వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్ జిల్లా అధ్యక్షుడు అంగిరేకుల ఆదినారాయణయాదవ్ శివస్వాములకు, భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే మండల కేంద్రం పెద్దారవీడులో ఆంజనేయస్వామి దేవాలయంలో దాతల సాయంతో శ్రీశైలం వెళ్లే శివస్వాములకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?



ఛిద్రమై కంకర రాళ్లు లేచిన పెద్దవరం రోడ్డు

కురిచేడు: మండల కేంద్రమైన కురిచేడు నుంచి పెద్దవరం, దేకనకొండ వెళ్లే రోడ్డు మార్గం గుంతలమయమై నడిచేందుకు కూడా వీల్లేకుండా తయారైంది. రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పిన పాలకులకు ఈ రోడ్డు కనిపించలేదా? అని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రం నుంచి ఎన్ఎస్‌పీ అగ్రహారం, పెద్దవరం, దేకనకొండ, మర్లపాలెం గ్రామాల మీదుగా పోతవరం నుంచి చలివేంద్ర వరకు ఈ రోడ్డు కొనసాగుతుంది. ఈ మార్గంలో అటు నియోజకవర్గ కేంద్రం దర్శి వెళ్లేందుకు, ఇటు మండల కేంద్రం కురిచేడు వచ్చేందుకు ఐదు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్సులు తిరగకపోయినా ఆటోలు, ద్విచక్ర వాహనాల ద్వారా ప్రజలు రాకపోకలు సాగించి తమ పనులు చక్కబెట్టుకుంటుంటారు. అయితే రోడ్డు మొత్తం గుంతలు పడి, కంకర రాళ్లు పైకి తేలడంతో వాహనదారులతోపాటు ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు కనీస మరమ్మతులు చేయిస్తే కొంతమేర రాకపోకలకు ఇబ్బంది తప్పుతుందని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా సంత్ గాడ్గే బాబా జయంతి

మార్కాపురం: నిరుపేద కుటుంబంలో జన్మించి కుల నిర్మూలన, అంటరానితనం నిర్మూలన కోసం పోరాడటంతోపాటు ఆధ్యాత్మిక చైతన్యం కోసం పాటుపడిన గొప్ప సంఘ సంస్కర్త సంత్ గాడ్గే బాబా అని రజక విద్యా సంక్షేమ సంఘ అధ్యక్షుడు దేవలూటి శంకర్ పేర్కొన్నారు. పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో ఆదివారం సంత్ గాడ్గే బాబా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం రాక ముందే విద్యకోసం 154 పాఠశాలలు, మహారాష్ట్రలో యూనివర్శిటీని గాడ్గే బాబా ప్రారంభించి విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. అప్పట్లోనే స్వచ్ఛభారత్‌ను ఆచరించిన మహనీయుడని కొనియాడారు. స్వచ్ఛభారత్ పితామహుడిగా సంత్ గాడ్గే బాబాను కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తన గురువుగా సంత్ గాడ్గే బాబాను ప్రకటించుకున్నారని, ఫిబ్రవరి 23ను సఫాయి కర్మచారీ దివస్‌గా ప్రకటించాలని రజక సంఘ నాయకుడు వెంకటేశ్వర్లు కోరారు. ఈ సందర్భంగా పేద, తల్లిదండ్రులు లేని విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శివయ్య, ఆర్.కాశయ్య, చిరంజీవి, లక్ష్మీనారాయణ, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కాశయ్య, కాశీరావు, చెరుకుపల్లి శివయ్య, ఏపీ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ సంఘ చైర్మన్ రంగనాయకులు, వైస్ చైర్మన్ శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ గాలెం కాశయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

చదువుతోనే జ్ఞానం పెరుగుతుంది



చదవడం మాకిష్టంలో పాల్గొన్న విద్యార్థులు

యర్రగొండపాలెం: నిరంతరం చదువుతూ ఉంటే జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని స్థానిక శాఖ గ్రంథపాలకురాలు కె.రూన్సీ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువులపై దృష్టి సారిస్తే పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చన్నారు. ప్రతి ఆదివారం గ్రంథాలయంలో జరిగే చదవడం మాకిష్టం కార్యక్రమంలో 5 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు పాల్గొనవచ్చని ఆమె తెలిపారు. గ్రంథాలయంలో జనరల్ నాలెడ్జి, కథల పుస్తకాలు, చరిత్ర, మత గ్రంథాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రేపటి నుంచి సాయిబాబా మందిరంలో అన్నదానం

పెద్దారవీడు: మండలం పరిధిలోని చట్లమిట్ల గ్రామంలో వెలసిన షిరిడీ సాయిబాబా మందిరంలో అన్నదాన సేవా సమితి సంఘం సభ్యుల ఆధ్వర్యంలో 25, 26, 27 తేదీల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. కర్నూల్–గుంటూరు రహదారిలో ఉన్న చట్లమిట్ల గ్రామం అడ్డరోడ్డు వద్ద అన్నదాన సత్రంలో శ్రీశైలం వెళ్లే శివస్వాములు, కాలినడక భక్తులు, యాత్రికులకు మంగళ, బుధ, గురు వారాలల్లో మధ్యాహ్నం గం.12.30 నుంచి 3 గంటల వరకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గుంటి గంగ అమ్మవారు

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ సోమవరప్పాడు గ్రామ పరిధిలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగాభవాని ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు విజయలక్ష్మి, బాలరాజు, కామేశ్వర శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయంలోని మల్లికార్జునస్వామి, నాగమ్మ తల్లి విగ్రహాలను పూజించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఈవో గుంటపల్లి వాసు పరిరక్షించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

శేష వాహనంపై నిర్మమహేశ్వరుడు

పొదిలి రూరల్: పొదిలి పార్వతీ సమేత నిర్మమహేశ్వర దేవస్థానంలో కొలువైన నిర్మమహేశ్వరుడు ఆదివారం రాత్రి 8 గంటలకు అర్ధనారీశ్వర రూపంలో ప్రత్యేకంగా అలంకరించి శేష వాహనంపై పట్టణంలోని పురవీధుల్లో ఊరేగించారు. పెదసంఖ్యలో భక్తులు హాజరై పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉభయదాతలు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

అల్లూరి పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ, ఎస్వీకేపీ కళాశాల రోడ్డులోని పోలేరమ్మ తల్లికి ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగ శిలలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టిమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.